క్లుప్తంగా

కాకాణి నివాళి



నివాళులర్పిస్తున్న గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: మండలంలోని తోడేరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఒంటేరు ధన్‌రాజ్ ఇటీవల మృతిచెందాడు. గురువారం దశదిన కర్మ నిర్వహించగా వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హాజరై నివాళులర్పించారు. ఆయన వెంట తోడేరు మాజీ సర్పంచ్ ఏనుగు శశిధర్‌రెడ్డి, రవీంద్ర, కిశోర్ తదితరులున్నారు.

అదుపుతప్పిన కారు

• తప్పిన ప్రాణాపాయం

విడవలూరు : కారు అదుపుతప్పి కాలువ వైపు దూసుకెళ్లిన ఘటన మండలంలోని పటేల్‌నగర్ కాలనీ సమీపంలోని పెద్ద కాలువ వద్ద గురువారం చోటుచేసుకుంది. వావిళ్ల గ్రామం నుంచి కారు విడవలూరు వైపు వస్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కాలువ వైపు దూసుకెళ్లింది. కాలువ పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టడంతో కారు కాలువలోకి వెళ్లకుండా ఆగింది. వెంటనే స్థానికులు గుర్తించి ట్రాక్టర్ సహాయంతో కారును బయటకు తీశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణహాని జరగలేదు.

ప్రాణాల మీదకు తెస్తున్న గుంతలు

• రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన బుజ్జయ్య

మనుబోలు: రోడ్డు మధ్యలో ఉన్న గుంత కారణంగా ఇద్దరు ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన గురువారం మండలంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని మనుబోలు – పొదలకూరు రోడ్డు మార్గంలో మడమనూరు జగనన్న లేఅవుట్ వద్ద పొదలకూరు వైపు వెళ్తున్న మోటార్‌బైక్ రోడ్డు మధ్యలో ఉన్న గుంతల్లో పడి అదుపు తప్పింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న గూడూరు గాంధీనగర్‌కు చెందిన బుజ్జయ్య, కిశోర్‌లు తీవ్రంగా గాయపడ్డారు.

చౌకచర్లలో రైతుల ఆందోళన



నిరసన తెలుపుతున్న రైతులు

విడవలూరు : మండలంలోని చౌకచర్ల చెరువు వద్ద రైతులు గురువారం ఆందోళన చేపట్టారు. తమకు సాగునీరు అందించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోలిరెడ్డి అశోక్‌రెడ్డి మాట్లాడుతూ మా చెరువు 500 ఎకరాల విస్తీర్ణంలో ఉందని, దీని కింద 4500 ఎకరాల్లో రైతులు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. చెరువులో రెండు తూములకు చెక్కలు ఊడిపోయాయని, ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. కాలువ కూడా పూడిపోయి ఉందని, ఇంకెప్పుడు పూడికలు తీపిస్తారని ప్రశ్నించారు. ఇకనైనా ఇరిగేషన్ అధికారులు చెరువు వద్దకు వచ్చి రైతుల సమస్యలు తీర్చాలన్నారు. కార్యక్రమంలో స్థానిక రైతులు తూపిలి చిన్న రాఘవయ్య, కలికి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ భేష్

కొడవలూరు : గ్రంథాలయంలో రికార్డుల నిర్వహణ బేషుగ్గా ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్ రాజా కొనియాడారు. కొడవలూరులోని గ్రంథాలయాన్ని ఆయన గురువారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. గ్రంథాలయ కార్యక్రమాల అమలుతో పాటు రికార్డుల నిర్వహణపై అధికారులు దృష్టి సారించాల్సి ఉందన్నారు. గ్రంథాలయ అధికారి కె.రాజేశ్వరి ఉన్నారు.

కాకాణిపై టీడీపీ నేతల ఫిర్యాదు

మనుబోలు: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై టీడీపీ మండల నాయకులు గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాకాణి సర్వేపల్లి శాసనసభ్యుడైన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని అందులో పేర్కొన్నారు. నాయకులు గాలి రామకృష్ణారెడ్డి, ఉడతా విజయ్, నూనె లక్ష్మయ్య, చల్లగిరి చిట్టిబాబు, శివుడు రాజాగౌడ్, రాయపాటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ



కోవూరు : కోవూరులోని అరుంధతీయ ఎయిడెడ్ పాఠశాలలో విద్యార్థులకు గురువారం పుస్తకాలను అందజేశారు. పారిశ్రామికవేత్త వెంకటేశ్వరరావు దాతృత్వంలో దీనిని అందించారు.

కూరగాయలు కొనలేం.. తినలేం!

• పెరిగిపోయిన ధరలు
• పేద, మధ్య తరగతి వర్గాల బెంబేలు
• ప్రతీది కిలో రూ.50 పైమాటే..



ముత్తుకూరులోని కూరగాయల దుకాణం

ముత్తుకూరు: కాయకూరల ధరలు రోజురోజుకు మండిపోవడంతో పేద, మధ్య తరగతి వర్గాలు బెంబేలెత్తిపోతున్నాయి. వాటి సాగుకు కూటమి ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహకాలు లేకపోవడం ఒక కారణమైతే.. అంతంతమాత్రం సాగు చేసిన పంటలు వరుసగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతింటుండటంతో దిగుబడులు బాగా పడిపోయాయి. డిమాండ్‌కు తగ్గట్టుగా ఉత్పత్తి లేకపోవడంతో మార్కెట్లో కొరత ఏర్పడినట్లు వ్యాపారులు చెబుతున్నారు. దీంతో ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఇప్పటికే బియ్యం, పప్పులు, వంట నూనెలతోపాటు వివిధ నిత్యావసర వస్తువుల ధరలు అధికంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో కూలీలు, కార్మికుల కుటుంబాలు తల్లడిల్లుతున్నాయి. క్యారెట్, బీన్స్, వంకాయలు, బెండకాయలు, కాకరకాయలు, ఎర్రగడ్డలు రోజుకో విధంగా ఉంటున్నాయి. మండలంలో వ్యవసాయ కూలీలతోపాటు, వివిధ ప్రాజెక్ట్‌లో పనిచేసే కార్మికుల కుటుంబాల సంఖ్య అధికం. నిత్యావసర వస్తువుల ధరలకే సతమతమవుతున్న కుటుంబాలు చుక్కలు చూపిస్తున్న కాయకూరల రేట్లకు తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయి.

సామాన్యులపై బాదుడే బాదుడు

చికెన్, మటన్, కోడిగుడ్డు కంటే కాయకూరలే విలువైన ఆహారంగా మారాయి. నియంత్రణ లేని ధరలకు జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఒక్కటీ రూ.50, దానికి పైమాటే ఉంది. కూటమి ప్రభుత్వం మాత్రం నోరుమెదపని పరిస్థితి ఏర్పడింది. కూరల కొనుగోలుకు రూ.100 తీసుకెళ్తే సగం సంచి కూడా నిండని పరిస్థితి నెలకొంది. ఇక స్వచ్ఛమైన ఆకుకూరలు దొరకడమే గగనమైంది. ఇక పోషకాలు, విటమిన్లు పిల్లలకు, వృద్ధులకు ఏ విధంగా లభిస్తాయో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది.

కూరల వివరాలు	(కిలో) హోల్‌సేల్ (రూ.ల్లో)	రిటైల్ (రూ.ల్లో)
టమాటాలు	50	60
వంకాయలు	60	70
బెండకాయలు	60	70
ఉల్లిపాయలు	50	60
క్యారెట్	70	80
బీట్రూట్	60	70
పచ్చిమిర్చి	60	75

పోషకాహారం ఎలా?



కూలీ పనులు చేసుకునే వాళ్లు కూరలు కొనలేకపోతున్నారు. ధరలు మండిపోతే పిల్లలకు పోషకాహారం ఏ విధంగా లభిస్తుంది.
– మేనాటి లక్ష్మమ్మ, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, ముత్తుకూరు

భయంగా ఉంది



రోజురోజుకూ మండిపోతున్న కాయకూరల ధరలకు భయపడిపోతున్నాం. పెరిగిపోయిన నిత్యావసర వస్తువుల ధరలకు తోడు కూరల ధరలు కూడా పేదలకు అందడం లేదు. సంపాదనకు, ధరలకు పొంతన కుదరడం లేదు.
– తాండ్ర సుజాతమ్మ, నారికేళపల్లి

కొనలేకపోతున్నాం



కూరగాయల ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. సాధారణ కూరలైన వంకాయలు, టమాటాలు, పచ్చి మిరపకాయలు, బెండకాయలు ధరలు ఎక్కువగా ఉన్నాయి. ఏమీ కొనలేకపోతున్నాం.
– తైదుపాటి వనజ, ఈపూరు

ముడుపులు తీసుకున్న చరిత్ర సోమిరెడ్డిది



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

• వైఎస్సార్‌సీపీ నాయకులు

పొదలకూరు: 'సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మంత్రిగా పనిచేసిన సమయంలో క్రికెట్ కిట్లు అమ్ముకున్నాడు. అంతే కాకుండా వ్యవసాయ శాఖ మంత్రిగా మిల్లర్ల వద్ద ముడుపులు తీసుకున్న చరిత్ర ఉంది' అని వైఎస్సార్‌సీపీ నాయకులు మండల విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, వార్డు సభ్యుడు ఎస్‌కే అంజాద్ విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంటే ఆయన్ను అవినీతిపరుడిగా చిత్రీకరించే ప్రయత్నం చేయడాన్ని ఖండించారు. పొదలకూరు స్వర్ణ లేఅవుట్ గురించి టీడీపీ నాయకులు మాట్లాడారని అందులో మా పార్టీ వారు అమ్మితే కొన్నది ఎవరని ప్రశ్నించారు. టీడీపీకి చెందిన వారే కొనుగోలు చేశారని, వారిపై కేసులు పెట్టించాల్సిందిగా డిమాండ్ చేశారు. ముడుపులు ఇవ్వకుంటే చెడ్డవారు, ముడుపులు సమర్పిస్తే మంచివాళ్లుగా మార్చేస్తున్నట్టు తెలిపారు. మండలంలో 52 ప్రైవేట్ లేఅవుట్లు ఉన్నాయని అన్నింటిపై విచారణ నిర్వహించి నిజాలను నిగ్గుతేల్చాల్సిందిగా పేర్కొన్నారు. అసైన్మెంట్ పొలాలపై లేనిపోని ఆరోపణలు చేస్తున్న టీడీపీ వారు 52 లేఅవుట్లపై సమగ్ర విచారణ నిర్వహించాల్సిందిగా డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యుడు జి.శ్రీనివాసులు, వార్డు సభ్యులు హేమంత్, ప్రసాద్, బి.ప్రసాద్, నాయకులు మద్దిరెడ్డి రమణారెడ్డి, వాకాటి శివారెడ్డి, ఎస్‌కే ఖాదర్, వై.వెంకటేశ్వర్లుగౌడ్, ఎన్.శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

• పోర్టు సీఈఓ జగదీష్ పటేల్



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నం పోర్టులో ఉద్యోగులు, కార్మికుల ఆరోగ్య పరిరక్షణే తమ ధ్యేయమని సీఈఓ జగదీష్ పటేల్ అన్నారు. పోర్టు లాజిస్టిక్ వర్క్‌షాపులో గురువారం ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అపోలో ఆస్పత్రి, అదానీ మెడికల్ సెంటర్ వైద్యులు శ్రీవర్ష, వీరరాఘవ తదతర సిబ్బంది 362 మందికి వైద్య పరీక్షలు జరిపారు. మందులు అందజేశారు.
కార్యక్రమంలో సీఓఓ రాజన్‌బాబు, అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, మీనీష్‌దేవ్, శ్రీధర్, వేణుగోపాలరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్యశిబిరం



పశు దాణా అందజేస్తున్న దృశ్యం

తోటపల్లిగూడూరు: మండలంలోని అనంతపురంలోని సీల్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, హీఫర్ ఇంటర్నేషల్ సంయుక్తంగా గురువారం నిర్వహించిన ఉచిత పశు వైద్యశిబిరానికి స్పందన లభించింది. పశు సంవర్ధక శాఖ సహకారంతో దీనిని ఏర్పాటు చేశారు. 408 పెద్ద పశువులకు, 808 సన్న జీవాలకు, 815 కోళ్లకు వైద్యం అందించారు. పాడిరైతులకు నట్టల నివారణ మందులు, దాణా తదితరాలను ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో ముత్తుకూరు వెటర్నరీ సహాయ సంచాలకుడు మురళీకృష్ణ, పశువైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసరావు, సీల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ అధికారులు ఆశిష్, డాక్టర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

తరలిరావాలి

కోవూరు: ఉచిత ఇసుక, భవన నిర్మాణ కార్మికులకు అండగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరిగే జిల్లాస్థాయి ర్యాలీకి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోవూరు వైఎస్సార్‌సీపీ మండల కమిటీ కోరింది. నెల్లూరు నగరంలో జరిగే కార్యక్రమానికి ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొంటారని తెలిపింది.

మద్యం షాపు ఎదుట మహిళల ధర్నా



షాపు ముందు ధర్నా చేస్తున్న మహిళలు

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెంలోని జొన్నవాడ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం తరలింపుపై స్థానిక మహిళలు మరోమారు గురువారం ధర్నా నిర్వహించారు. గత వారంలో ధర్నా సందర్భంగా ఏడు రోజుల్లో అనగా బుధవారానికి మారుస్తామని ఎస్సై సంతోష్‌రెడ్డి చెప్పారు. కానీ గురువారం నాటికి కూడా అమ్మకాలు సాగుతుండడంతో మహిళలు పెద్ద ఎత్తున షాపు ముందు కూర్చొని ధర్నా చేశారు. పోలీసులు వచ్చి మహిళలకు సర్ది చెప్పాలని యత్నించగా వారు నిరాకరించారు. వారంలో షాపును మరో చోటుకు మారుస్తామంటూ షాపు యజమానులు పేర్కొనడంతో ఓ కానిస్టేబుల్ అక్కడ కొందరిని తీసుకెళ్లి షాపు మార్పు చేసే ప్రదేశాన్ని పరిశీలించారు. భవన యజమానితో మాట్లాడి అడ్వాన్స్ కూడా ఇచ్చినట్లు తెలియడంతో మహిళలు మరో వారం రోజుల పాటు గడువు ఇచ్చారు.

ప్రసన్న పరామర్శ



కోవూరు: మండలంలోని లేగుంటపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గునపాటి తులసీరెడ్డి తండ్రి గునపాటి గోపాల్‌రెడ్డి ఇటీవల మరణించారు. గురువారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, అత్తిపల్లి అనూప్‌రెడ్డి, జెట్టి శ్యామసుందర్‌రెడ్డి, గంపా జగన్నాథం పాల్గొన్నారు.

'ప్రజలను మోసం చేసిన సూరా'

• సొంత పార్టీ నేత ఆరోపణ

బుచ్చిరెడ్డిపాళెం: టీడీపీ నేత సూరా శ్రీనివాసులురెడ్డి తన స్వగ్రామమైన పంచేడులోని ప్రజలను తీవ్రంగా మోసం చేశాడని అదే గ్రామానికి చెందిన ఆ పార్టీ నాయకుడు పెనాకా అమరనాథ్‌రెడ్డి ఆరోపించారు. బుచ్చిరెడ్డిపాళెం ఎంపీడీఓ కార్యాలయం వద్ద గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గోకులం పథకం కింద మండలంలో 48 మంది లబ్ధిదారులు ఎంపిక కాగా అందులో పంచేడు గ్రామానికే చెందిన ఏడుగురు లబ్ధిదారులు ఎంపికయ్యారని, చివరి నిమిషంలో నలుగురి పేర్లను తీసేసి ఆయనకు చెందిన వ్యక్తులను చేర్చుకున్నట్లు ఆరోపించారు. ఇలాంటి చర్యలు దారుణమన్నారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి విచారణ జరిపిస్తే వాస్తవాలు తెలుస్తాయన్నారు. దీనిపై ఎంపీడీఓ శ్రీహరిని వివరణ కోరగా ప్రజా ప్రతినిధులు సూచనల మేరకు వారిచ్చిన జాబితాను పశు సంవర్ధక శాఖ అధికారులకు పంపామన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఇందుకూరుపేట: ప్రస్తుత సీజన్‌లో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సి.మారుతీదేవి సూచించారు. మండలంలోని ఇందుకూరుపేట ఏడీఏ కార్యాలయంలో ఇందుకూరుపేట, టీపీగూడూరు, ముత్తుకూరు మండలాల వ్యవసాయ శాఖ సహాయకులకు గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉద్యానాధికారి ప్రసన్న, శాస్త్రవేత్తలు శ్రీలక్ష్మి, పరమశివ, ఏఓలు పాల్గొన్నారు.

వెంకటేశ్వర ప్రొఫెసర్‌కు పేటెంట్



ప్రొఫెసర్ కృష్ణచైతన్యను అభినందిస్తున్న చైర్మన్

కొడవలూరు : అధునాతన సేంద్రియ వ్యవసాయానికి సంబంధించి నార్తురాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ కృష్ణ చైతన్య పేటెంట్ హక్కులు పొందారు. 'ఐఓటీ డ్రివెన్ ఆక్వా పోనిక్స్ సొల్యూషన్ ఫర్ మోడ్రన్ ఆర్గానిక్ ఫార్మింగ్'పై ది పేటెంట్ ఆఫీస్ ఇండియా నుంచి ఆయన హక్కులు పొందారు. ఈ క్రమంలో ప్రొఫెసర్ కృష్ణచైతన్యను కళాశాలలో గురువారం చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ ప్రత్యేకంగా అభినందించారు.

పొదుపు సభ్యుల సమావేశం

కోవూరు: కోవూరులోని సంఘమిత్ర కార్యాలయంలో 19వ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి పాల్గొని, మాట్లాడారు. సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకారం

• జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



పాఠశాలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ అరుణమ్మ

తోటపల్లిగూడూరు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తెలిపారు. మండలంలోని చిన్నచెరుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం ఆమె పరిశీలించారు. టీచర్లు, విద్యార్థులతో విడివిడిగా సమావేశాలు నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉందని ఆరాతీశారు. అనంతరం అరుణమ్మ మాట్లాడుతూ జిల్లాలోని జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష అభియాన్ పీఓ ఉషారాణి, హెచ్‌ఎం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ముత్తుకూరులో మెగా రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరం వద్ద సీఐ రవినాయక్

ముత్తుకూరు: పోలీసు అమరవీరుల సంస్మరణ దినం వారోత్సవాల సందర్భంగా ముత్తుకూరు షాదీమంజిల్‌లో గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కృష్ణపట్నం సీఐ రవినాయక్ దీనిని ప్రారంభించారు. ముత్తుకూరు ఎస్సై విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో శిబిరం జరిగింది. పెద్ద సంఖ్యలో యువకులు విచ్చేశారు. 100 మందికిపైగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, పల్లంరెడ్డి రామమోహన్‌రెడ్డి, మల్లికార్జునయాదవ్ పాల్గొన్నారు.

భూ సమస్యలపై గ్రామసభలు



అధికారులకు అర్జీలు అందజేస్తున్న రైతులు



కొడవలూరు: మాట్లాడుతున్న తహసీల్దార్ స్ఫూర్తి

మనుబోలు: మండలంలోని బండేపల్లి, జట్లకొండూరు గ్రామాల్లో గురువారం జరిగిన గ్రామసభలో 130 అర్జీలు అందినట్లు తహసీల్దార్ సుబ్బయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూ సమస్యలపై గ్రామసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతులు తమ సమస్యలను అర్జీల రూపంలో అందిస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమాల్లో రీసర్వే డీటీ మంజుల, వీఆర్వో రమేష్, సర్వేయర్ శ్రీనివాసులు, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు పరిష్కారం

కొడవలూరు: రీసర్వేపై వచ్చిన సమస్యలకు గ్రామసభలో పరిష్కారం చూపుతామని తహసీల్దార్ కె.స్ఫూర్తి తెలిపారు. మండలంలోని మానేగుంటపాడులో గురువారం గ్రామసభ నిర్వహించి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చిన వినతులకు 15 రోజుల్లో తప్పక పరిష్కారం చూపుతామని చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీలత, రీసర్వే డీటీ అరుణ్‌కుమార్, వీఆర్వో మన్నేపల్లి రమేష్‌బాబు పాల్గొన్నారు.

ప్రసన్నకు నాయకుల అభినందన



చలపతిరావు



శ్రీనివాసులురెడ్డి



ప్రసన్నకు పూలమొక్క అందజేస్తున్న విల్సన్, ప్రవల్లిక

కోవూరు/ఇందుకూరుపేట: మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించిన నేపథ్యంలో నియోజకవర్గంలోని పలువురు నాయకులు గురువారం నెల్లూరులోని ఆయన నివాసంలో కలిసి అభినందనలు తెలిపారు. ఈ క్రమంలో పూలమొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. వారిలో డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, బట్టా విల్సన్, ప్రవల్లిక, ఇందుకూరుపేట మాజీ సొసైటీ అధ్యక్షుడు కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి తదితరులు ఉన్నారు.

ఎనిమిది టిప్పర్ల స్వాధీనం



పోలీస్‌స్టేషన్ ముందు ఉన్న టిప్పర్లు

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెం మీదుగా బుధవారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఎనిమిది టిప్పర్లను పోలీసులు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్ వద్ద ఉంచారు. దీనిపై సీఐ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ పట్టుబడిన టిప్పర్లు పొట్టేపాళెం ఇసుక రీచ్ నుంచి వచ్చిందని, దీనిని గుంటూరు, ఏలూరు, చిలకలూరిపేటతో పాటు పలు జిల్లాలకు తరలిస్తున్నారని తెలిపారు. ఈ టిప్పర్లపై పెనాల్టీ విధించి కోర్టులో హాజరు పెట్టనున్నట్లు తెలియజేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పల్లిపాడు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఇందుకూరుపేట: నవంబర్ 9వ తేదీ నుంచి విజయనగరం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు మండలంలోని పల్లిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం జి.సుభాష్‌బాబు గురువారం తెలిపారు. నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన అండర్–14 వాలీబాల్ ఎంపికల్లో బాలికలు విభాగంలో ఎస్.శ్రావ్య, ఎ.శిరీష ప్రతిభ కనబరిచి జిల్లా జట్టులో స్థానం సాధించారన్నారు. ఈ క్రమంలో వారిని అభినందించారు.

దోమల నివారణకు చర్యలు



బావిలో క్లోరినేషన్ చేస్తున్న వైద్య సిబ్బంది

కొడవలూరు: మండలంలోని పెయ్యలపాళెంలో కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రామకృష్ణ ఆదేశాల మేరకు గురువారం వైద్య సిబ్బంది దోమల నివారణ చర్యలు చేపట్టారు. స్థానిక దళితవాడలో జ్వర బాధితులు ఉన్నారనే సమాచారంతో గ్రామంలో లార్వా సర్వే నిర్వహించారు. నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ చేయడంతో పాటు మలాథియాన్ స్ప్రే చేశారు. గ్రామంలోని బావులు, నీళ్ల ట్యాంక్‌లలో క్లోరినేషన్ చేపట్టారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి నాగరాజు, హెచ్‌ఎస్ వి.రామ్మోహన్, హెచ్‌ఏలు షఫీ ఉద్దీన్, సీహెచ్.సుధాకర్ యాదవ్, ఒ.సుధాకర్ పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న విల్సన్

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని బాలకృష్ణ గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న స్థలాన్ని సామాజిక భవనానికి కేటాయించాలంటూ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు విల్సన్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డికి గురువారం వినతి పత్రం అందజేశారు. అంబేడ్కర్ నగర్, బాలకృష్ణ గిరిజన కాలనీకి ఉపయోగకరమైన సామాజిక భవనాన్ని ఇక్కడ నిర్మించేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.